ఆంధ్రజ్యోతి




జిల్లాకేంద్రంలో నినదిస్తూ సాగుతున్న వైద్యులు





అరాచకాలను అరికట్టండి..!

నగరంలో నినదించిన జూడాలు

కోల్‌కతా హత్యాచార ఘటనపై ఆగ్రహం

క్లాక్ టవర్ వద్ద మానవహారంగా ఏర్పడిన డాక్టర్లు, ప్రజా సంఘాలు

అనంతపురం టౌన్, ఆగస్టు 16: కోల్‌కతా మెడికల్ కాలేజీలో పీజీ వైద్యురాలిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ జూడాలు ఆందోళనకు దిగారు. దోషులను కఠినంగా శిక్షించాలని, డాక్టర్ల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ శనివారం విధులను బహిష్కరించారు. జిల్లా సర్వజన వైద్యశాల నుంచి సప్తగిరి సర్కిల్, క్లాక్ టవర్ మీదరుగా భారీ ర్యాలీ నిర్వహించారు. వీరి ఆందోళనకు ఐఎంఏ, ప్రభుత్వ వైద్యుల సంఘం, నర్సింగ్ హోమ్స్ అసోషియేషన్, మెడికల్ రెప్స్, ఏపీజేఏసీ అమరావతి జిల్లా విభాగం, ఐద్వా, ఏడీఎస్ఓ, జాతీయ మానవ హక్కుల వేదిక తదితరుల సంఘాలు సంఘీభావం తెలిపాయి. న్యాయం కావాలని నినదించారు. మహిళా వైద్యురాలి హత్యాచారం పట్ల పశ్చిమ బెంగాళ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. దోషులను పట్టుకుని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, లేదంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జూడాల సంఘం నాయకులు సమరసింహారెడ్డి, రాఘవేంద్ర, హరినాథ్ రెడ్డి, ఐఎంఏ నాయకులు డాక్టర్ హేమలత, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, అభిషేక్ రెడ్డి, అక్బర్ సాబ్ ప్రభుత్వ వైద్యులు రామస్వామినాయక్, వాల్మీకి శ్రీనివాస్, వైవీ ప్రసాద్, శ్రీదేవి, షంషాద్‌బేగం, రేణుక, షబానా, శంకర్ తదితరులు పాల్గొన్నారు. జూనియర్ వైద్యులు, పీజీలు విధులను బహిష్కరించడంతో జిల్లా ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యాధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు పర్యవేక్షించారు.

ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు కృష్ణా జలాలు..



హెచ్చెల్సీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు: మండలంలో చెరువులకు ఎత్తిపోతల పథకం ద్వారా రెండురోజుల్లో నీటిని విడుదల చేస్తామని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. యల్లనూరు, గడ్డంవారిపల్లి, గొడ్డుమర్రి చెరువులను కృష్ణా జలాలతో నింపుతామని ఆమె భరోసా ఇచ్చారు. ఇప్పటికే గండికోట రిజర్వాయర్‌కు 7 టీఎంసీల నీరు చేరిందని, నీటి పంపింగ్ విషయమై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడామని అన్నారు. ఈ చెరువులకు నీరు వచ్చి చేరితే యల్లనూరు, పుట్లూరు మండలాల్లోని సుమారు 30కి పైగా గ్రామాలలో నీటి ఎద్దడి ఉండదని అన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి

23లోపు సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలి : కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సొసైటీలు) ఈనెల 23లోపు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో సొసైటీల కంప్యూటరైజేషన్‌పై శనివారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సొసైటీలను కంప్యూటరీకరణ చేసి, సహకార వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సొసైటీల ఆన్‌లైన్‌కు గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లను ఉపయోగించుకునేలా ఆయా మండలాల ఎంపీడీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, పేదలకు సులువుగా రుణాలు అందించే సహకార సొసైటీలను రక్షించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 58సొసైటీలు నాలుగు స్థాయిల్లో కంప్యూటరీకరించాల్సి ఉందన్నారు. ప్రాథమిక స్థాయిలో సభ్యత్వం, రుణాలకు సంబంధించిన రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. డిపాజిటర్లు, ఇన్వెస్ట్‌మెంట్లు తదితర వాటికి సంబంధించి గడువులోపు లక్ష్యాన్ని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, డీసీఓ అరుణకుమారి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, డీపీఓ ప్రభాకర్‌రావు, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీఎల్‌సీఓ ప్రభాకర్ రెడ్డి, సహకార శాఖ అధికారులు, సొసైటీల సీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ ఆంధ్రా ప్రణాళిక రూపొందించండి

అనంతపురం టౌన్: ప్రతిశాఖ వికసిత్ ఆంధ్రా ప్రణాళిక కార్యాచరణను రూపొందించాలని జిల్లా అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిశాఖ పరిధిలో మూడు స్థాయిల్లో ప్రణాళికలు తయారు చేయాలన్నారు. శాఖల అధికారులందరు కేటాయించిన జాబ్‌రోల్‌ను చదువుకొని, ఏమేమి చేయాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐఎస్ఓ గుర్తింపుకోసం ఈనెలాఖరువరకు గడువు ఉందని అంతలోపు అన్నికార్యాలయాలకు సర్టిఫికెట్ చేయించాలని ఆదేశించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభయ ప్రదాతా..! హనుమా

హనుమాన్ ఆలయాల్లో శ్రావణ పూజలు



అలంకారాలలో నెట్టికంటి, నేమకల్లు, మురడి ఆంజనేయస్వామి

గుంతకల్లు/బొమ్మనహాళ్/డీ.హీరేహాళ్, ఆగస్టు 17: పవిత్ర శ్రావణ మాసంలో జిల్లాలోని వివిధ ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యంగా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి, మురడి, నేమకల్లు ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కసాపురం ఆలయంలో తెల్లవారుజామునే నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి మూల విరాట్టుకు అభిషేకాలు, వజ్ర ఖచిత, స్వర్ణ కవచ, పుష్పాలంకారాలు చేసి, భక్తులకు దర్శనం కలిగించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం, సుందరకాండ పఠనాలను చేశారు. సాయంత్రం సీతారామ లక్ష్మణ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించి హనుమంత వాహనంపై ఆశీనులనుగావించి ఊరేగించారు. నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి లక్ష తులసీ దళాలతో అలంకరణ చేశారు. మురడి ఆంజనేయస్వామికి సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం కుంకుమార్చన, బిళ్వార్చన, సహస్ర నామార్చన తదితర అభిషేకాలు నిర్వహించారు. వరుస సెలవులు రావడంతో ఆయా ఆలయాలకు ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు.

తుంగభద్రం

- స్టాప్‌లాగ్ ఏర్పాటు విజయవంతం
- జలాశయం క్రస్ట్‌గేట్‌ల మూసివేత
- 72 టీఎంసీలు దాటిన నిల్వలు
- 84,796 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- టీం కన్నయ్య నాయుడికి సత్కారం



స్టాప్‌లాగ్ ఏర్పాటు తరువాత..

రాయదుర్గం, ఆగస్టు 17: ఒక శనివారం రాత్రి కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ స్థానంలో మరో శనివారం సాయంత్రానికి అడ్డుకట్ట వేయడం విజయవంతమైంది. కన్నయ్య నాయుడి నేతృత్వంలోని నిపుణులు, కార్మికుల బృందం అహోరాత్రులు శ్రమించి.. డ్యాం 19వ క్రస్ట్‌గేట్ స్థానంలో అంతే పరిమాణంలో ఐదు భాగాలుగా స్టాప్‌లాగ్‌ను ఏర్పాటు చేసింది. అత్యంత సాహసోపేతమైన ఈ ఆపరేషన్ సక్సెస్ కావడంతో నిపుణులు, కార్మికులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. టీబీ బోర్డు ఈ ప్రక్రియలో భాగమైన అందరినీ శనివారం రాత్రి ఘనంగా సత్కరించింది. క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడంతో ఇక ఈ ఏడాది ఆయకట్టు సాగు ఉండదేమోనని ఆందోళన చెందిన రైతాంగానికి వర్షాల రూపంలో ఇంకో శుభవార్త..! స్టాప్‌లాగ్ ఏర్పాటుతో డ్యాంలో మళ్లీ పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు కలిగింది. శనివారం ఉదయం 40 వేల క్యూసెక్కులు ఉన్న వరద.. సాయంత్రానికి 84 వేల క్యూసెక్కులు దాటింది. ఇదే స్థాయిలో ఇన్‌ఫ్లో కొనసాగితే.. డ్యాం నిండటానికి మరో వారం చాలు అని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా.. డ్యాం నిండటం మాత్రం ఖచ్చితమేనన్న విశ్వాసం వారిలో వ్యక్తమౌతోంది.

(వివరాలు మెయిన్‌లో..)

ప్రత్యామ్నాయ వాన..!

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

పొంగిపొర్లిన వాగులు, వంకలు

వాహనాల రాకపోకలకు అంతరాయం

269.41 హెక్టార్లల్లో రూ.1.59 కోట్ల పంట నష్టం

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: ప్రధాన పంటల సాగుకు అదను దాటేవరకూ మొండికేసిన ఆకాశం.. శుక్రవారం రాత్రి కరిగిపోయింది. గంటల తరబడి వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వీధులు, ఇళ్లలోకి నీరు చేరింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అత్యధికంగా పుట్లూరు మండలంలో 138.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు 88.2, బుక్కరాయసముద్రం 88, రాప్తాడు 86.4, శింగనమల 85.4, యాడికి 82, కళ్యాణదుర్గం 75.4, నార్పల 70.8, పామిడి 69.4, శెట్టూరు 68.2, ఉరవకొండ 65.8, వజ్రకరూరు 64.4, కంబదూరు 64.2, గుత్తి 60.6, తాడిపత్రి 58.4, యల్లనూరు 56.8, బ్రహ్మసముద్రం 53.2, విడపనకల్లు 47.4, గార్లదిన్నె 46.8, అనంతపురం 45.0 , కుందుర్పి 43.6 , డి.హిరేహాళ్ 43.0, బొమ్మనహాళ్ 40.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 35.4 మి.మీ.లోపు నమోదైంది. ఈ వర్షంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవకాశం ఏర్పడింది. కానీ ఇప్పటికే సాగులో ఉన్న పంటలు మాత్రం దెబ్బతిన్నాయి.

పంటనష్టం

భారీ వర్షానికి జిల్లా వ్యాప్తంగా 269.41 హెక్టార్లల్లో రూ.1.59 కోట్లకుపైగా పంటనష్టం జరిగింది. పుట్లూరు, వజ్రకరూరు, బెళుగుప్ప, కణేకల్లు, పెద్దపప్పూరు తదితర మండలాల్లో 196 హెక్టార్లల్లో వేరుశనగ, కంది, మొక్కజొన్న, మినుము, పత్తి, వరి, సోయాబీన్ తదితర పంటలు దెబ్బతిన్నాయి. తద్వారా రూ.53 లక్షల నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పుట్లూరు, పెద్దపప్పూరు, నార్పల, కంబదూరు, శెట్టూరు, గుమ్మఘట్ట, శింగనమల, గుంతకల్లు, కళ్యాణదుర్గం, వజ్రకరూరు మండలాల పరిధిలో 73.41 హెక్టార్లల్లో రూ.1.06 కోట్లు విలువైన అరటి, ఎండు మిరప, టమోటా, బీర, కాకర, చామంతి, మిరప, కళింగర తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని ఆ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.



కంబదూరు మండలం జక్కిరెడ్డిపల్లిలో నీట మునిగిన టమోటా పంట

ఊరూరా వాన

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం జక్కిరెడ్డిపల్లిలో రైతు మారెప్ప సాగు చేసిన రెండు ఎకరాల టమోటా పంట నీట మునిగింది. తిమ్మాపురం వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో రైతు అశ్వర్థ సాగు చేసిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. కళ్యాణదుర్గం ఇందిరమ్మ కాలనీ ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. కాలనీ వంకను తలపించింది. కోత దశలో ఉన్న టమోటా, కర్బూజ పంటలు దెబ్బతిన్నాయి.



కాకర నేలమట్టం

శింగనమల: గుమ్మేపల్లి రైతు బ్యాళ్ల సుదర్శన్ సాగు చేసిన కాకర పంట నేలమట్టమైంది. రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగింది. రెండు ఎకరాల్లో 50 రోజుల క్రితం పందిళ్లు వేసి కాకర పంట సాగు చేశానని రైతు తెలిపారు.

నేలకొరిగిన అరటి

పెద్దపప్పూరు: ముచ్చుకోటలో తుమ్మల సుగుణ సాగు చేసిన 600 అరటిచెట్లు నేలకొరిగాయి. రూ.2.50లక్షలు నష్టం వాటిల్లింది. మండలవ్యాప్తంగా వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి.





నేలకొరిగిన జొన్న పంట



నీట మునిగిన వేరుశనగ పంట

నీట మునిగిన పంటలు

గుంతకల్లు: నాగసముద్రంలో వేరుశనగ, కంది, మొక్కజొన్న, బీర, కాకర, మిరప పంటలు దెబ్బతిన్నాయి. పందిళ్లు నేలకొరిగాయి. కొండ నుంచి భారీగా వర్షపు నీరు పల్లానికి పారడంతో నేలలు కోతకు గురయ్యాయి. 300 ఎకరాల్లో వేరుశనగ, 250 ఎకరాల్లో కంది, 30 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నాయి. మల్లికార్జున రెడ్డి, రాఘవయ్య, రామయ్య తదితరులు నష్టపోయారు. గుంతకల్లు-నాగసముద్రం రహదారిలో కల్వర్టుపై నీరు పారింది. ఓ కారు ఇరుక్కుపోవడంతో స్థానికులు సాయంచేసి బయటకు తీశారు.

రోడ్డు కోత

బ్రహ్మసముద్రం: సూగేపల్లి వంక ఉప్పొంగి రోడ్డు కోతకు గురైంది. భైరసముద్రం, బ్రహ్మసముద్రం, సూగేపల్లి, వెస్ట్‌కోడిపల్లి చెరువులకు నీరు చేరింది.

ధర్మవరం రూరల్: కనగానపల్లి మండల కేంద్రం, తల్లిమడుగుల, కుర్లపల్లి, దాదులూరు, మామిళ్లపల్లి, ముక్తాపురం వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ముక్తాపురం చెరువులోకి నీరు చేరింది. మామిళ్లపల్లి పెద్దవంక దాటబోయి కొట్టుకుపోతున్న ద్విచక్ర వాహనదారు మదన్‌ను స్థానికులు రక్షించారు.

నిలిచిపోయిన రాకపోకలు

చెన్నేకొత్తపల్లి: అమిదాలకుంట వద్ద వంగపేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఉధృతి తగ్గాక.. ఉదయం 11.45 గంటలకు రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. వెల్దుర్తి, చిన్నపరెడ్డిపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. చెన్నేకొత్తపల్లిలో పెద్దవంక ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. న్యామద్దల, నాగసముద్రం చెరువులకు నీరు చేరింది.

పండమేరు గలగల

రాప్తాడు: పండమేరు వంక పరవళ్లు తొక్కుతోంది. కొత్తపల్లి రైతు పి.లక్ష్మీనారాయణ తొలగించిన వేరుశనగ పంట తడిసిపోయింది. వంకలు, వాగులు, చెక్‌డ్యాంలకు భారీగా నీరు చేరింది.

బొమ్మనహాళ్: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు బొమ్మనహాళ్ జడ్పీ హైస్కూల్ మైదానం చెరువును తలపిస్తోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు.

బొమ్మనహాళ్: కొళగానహళ్లి వద్ద కబ్బాలివంక ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉద్దేహాళ్ వద్ద వేదవతి హగరికి భారీగా వరదనీరు చేరింది. దేవగిరిలో బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట దెబ్బతింది. రైతు అంజి రూ.8 లక్షలు నష్టపోయాడు.

కణేకల్లు: హనకనహాళ్ వద్ద వాగు పొంగడంతో కణేకల్లు, హనకనహాళ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఉరవకొండ, కణేకల్లు మధ్య నింబగల్లు వద్ద పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహించడంతో 8 గంటల సేపు రాకపోకలు స్థంభించాయి.

జలపాతం కనువిందు



యాడికి: నిట్టూరు వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జలపాతం కనువిందు చేస్తోంది.

ఉరవకొండ: పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కణేకల్లు-ఉరవకొండ రహదారిలో నింబగల్లు వంక ఉధృతి కారణంగా ట్రాఫిక్ స్తంభించింది. నింబగల్లు సమీపంలోని హెచ్చెల్సీ కోతకు గురైంది. బూదగవి చెరువు నిండి మరువ పారింది.

యల్లనూరు: అచ్యుతాపురం రైతు యశోదమ్మ రెండు ఎకరాల్లో సాగుచేసిన కలింగర పంట కొట్టుకుపోయింది. పది రోజుల్లో కోత కోయాల్సిన సమయంలో రూ.2 లక్షల పంట నీటిపాలైంది. తహసీల్దారు నాగరాజు, హార్టికల్చర్ ఉద్యోగి విజయ్ పొలాన్ని పరిశీలించారు.

విడపనకల్లు: ఆర్.కొట్టాల-గడేకల్లు మధ్య పెద్ద వంక పొంగిపొర్లింది. విడపనకల్లు-గుంతకల్లుకు రాక పోకలు 10 గంటల పాటు నిలిచి పోయాయి. గుంతకల్లుకు వెళ్ళే వాహనాలు కర్ణాటకలోని చేళ్లగురికి మీదుగా ప్రయాణించాయి.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం

అండర్ పాస్ సర్కిళ్ల వద్ద సర్వీస్ రోడ్డు వెడల్పు

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

జాతీయ రహదారుల అధికారులతో కలిసి సర్వీస్ రోడ్ల పరిశీలన



ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: అనంతపురం జిల్లా కేంద్రం పరిధిలోని జాతీయ రహదారి కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. స్థానిక రుద్రం పేట, కళ్యాణదుర్గం, బళ్లారి బైపాస్, తపోవనం సర్కిల్ వద్ద ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ జాతీయ రహదారుల అధికారులకు శనివారం సాయంత్రం స్వయంగా చూపించారు. రుద్రంపేట సర్కిల్ వద్ద స్థానిక ఆటోవాలాలు, వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కక్కలపల్లి క్రాస్ నుంచి రుద్రం పేట సర్కిల్ మీదుగా, కళ్యాణ దుర్గం సర్కిల్, బళ్లారి సర్కిల్, తపోవనం దారితో పాటు ఆయా సర్కిళ్ల నుంచి నగరంలోకి వచ్చి, పోయేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఫోర్‌వే లైన్‌ను సిక్స్‌వేగా మార్చేందుకు డీపీఆర్ సిద్ధం చేయించి, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి నిధులు మంజూరుకు విన్నవిస్తామన్నారు. ఆలోగా రుద్రం పేట, కళ్యాణ దుర్గం, బళ్లారి రోడ్డు కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్డును వెడల్పు చేసి ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా రు. బెంగుళూరు నుంచి బళ్లారి, కళ్యాణదుర్గంవైపుగా వెళ్లే వాహనాలు రుద్రం పేట సర్వీస్ రోడ్డుపై రాకుండా బ్రిడ్జిపైన రుద్రంపేట సర్కిల్ దాటి డీ మార్ట్ దాటిన తర్వాత బ్రిడ్జి నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్లేలా సదుపాయం కల్పించాలన్నారు. తపోవనం సర్కిల్ వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో రాత్రి సమయాల్లో లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సిక్స్ వే లైన్ నిర్మాణం సమయంలో తపోవనం సర్కిల్‌తోపాటు గజరాంపల్లి, నీలూరు, పామిడి,ఇల్లూరు, లోలోరు, రాంనగర్, కక్కలపల్లి, ప్రసన్నాయపల్లి, రాప్తాడు జంక్షన్, రామినేపల్లి, మరూరు, హంపాపురం తదితర బ్లాక్ స్పాట్స్‌లో అండర్ పాస్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



రుద్రం పేట సర్కిల్ సమీపంలో ట్రాఫిక్ జామ్‌లో 108 అంబులెన్స్‌లు

అనంత క్రీడాగ్రామంలో
5 నుంచి దులీప్‌ట్రోఫీ
పాల్గొననున్న భారతజట్టు కీలక ఆటగాళ్లు



దులీప్‌ట్రోఫీకి ఆతిథ్యమివ్వనున్న అనంత క్రీడాగ్రామం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17: దులీప్‌ట్రోఫీ అనంతక్రీడా గ్రామంలోని ఆర్డీటీ స్టేడియంలో సెప్టెంబరు 5 నుంచి జరగనుంది. దిగ్గజ ఆటగాళ్లు ఈ ట్రోఫీలో పాల్గొననున్నారు. ఇండియా-ఏ, ఇండియా-బీ, ఇండియా-సీ, ఇండియా-డీ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి. జట్ల వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

ఇండియా ఏ జట్టు

శుభమన్‌గిల్ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్‌పరాగ్, ధ్రువ్‌జురెల్, కేఎల్ రాహుల్, తిలక్‌వర్మ, శివందూబే, తనుష్‌కొటినా, కులదీప్ యాదవ్, ఆకాష్‌దీప్, ప్రసిద్ధ్‌కృష్ణ, ఖలీల్‌అహ్మద్, అవేష్‌ఖాన్, విద్వత్ కావేరప్ప, కుమార్ కుష్రగా, శావత్ రావత్

ఇండియా బీ జట్టు

అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశశ్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్‌పంత్, ముషీర్‌ఖాన్, నితీష్‌కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రవీంద్రజడేజా, మహ్మద్‌సిరాజ్, యష్‌దయాల్, ముకేష్‌కుమార్, రాహుల్‌చహర్, సాయికిశోర్, మోహిత్‌అవాస్తి, జగదీషన్

ఇండియా సీ జట్టు

రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటీదార్, అభిషేక్ పోరల్, సూర్యకుమార్ యాదవ్, బీ ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, ఉమ్రాన్‌మాలిక్, వైశ్యక్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్స్‌చౌహాన్, మయాంక్ మార్కండే, ఆర్యన్‌జుయల్, సందీప్ వారియర్

ఇండియా డీ జట్టు

శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), ఆతర్వటైడా, యష్‌దూబే, దేవ్‌దత్ పడిక్కల్, ఇసాన్‌కిషాన్, రిక్కీబాయ్, సరాన్ష్‌జైన్, అక్షర్‌పటేల్, అర్షదీప్‌సింగ్, ఆదిత్యథాక్రే, హర్షిత్‌రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్‌సేన్ గుప్తా, కేఎస్ భరత్, సౌరభ్‌కుమార్ ఉన్నారు. కాగా భారతజట్టులోని కీలక ఆటగాళ్లు వస్తుండటంతో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియాన్ని ముస్తాబు చేస్తున్నట్లు క్రికెట్ సంఘ జిల్లా కార్యదర్శి మధుఆచారి తెలిపారు. అంతర్జాతీయ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించే మ్యాచ్‌లు కేటాయించడం జట్ల ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచోఫెర్రర్ సంతోషం వ్యక్తం చేశారు.

జడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకరణ



ఓబుళమ్మ

అనంతపురం విద్య, ఆగస్టు 17: జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ఓబుళమ్మ నియమితులయ్యారు. శనివారం సీఈఓ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఆమె బంగ్లాలో మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు జిల్లాపరిషత్ ఉద్యోగులు, సిబ్బంది నూతన సీఈఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

21న ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

అనంతపురం టౌన్, ఆగస్టు 17: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం 21వ తేదీన ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌ఐల బదిలీ

అనంతపురం క్రైం, ఆగస్టు 17: జిల్లాలో ముగ్గురు ఎస్‌ఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని తాడిపత్రి రూరల్ పోలీస్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సాగర్‌ను నార్పలకు బదిలీ చేశారు. నార్పలలో పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని వీఆర్‌కు పంపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో వీఆర్, ఎస్పీలో ఉన్న తులశన్నను అనంతపురం పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 17: కలెక్టర్ ఆదేశాల మేరకు మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇందులో నలుగురు సభ్యులు ఉంటారని, వారిలో మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇద్దరు, మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల సంఘంలో ఇద్దరు ఉంటారన్నారు. వీరిలో ఒకరు మహిళా సభ్యురాలు ఉంటారన్నారు. ఆసక్తి గల వారు వివరాలతో 21వ తేదీలోపు జిల్లా కేంద్రంలోని దామోదరం సంజీవయ్య భవన్‌లోని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 11 దరఖాస్తులు

అనంతపురం విద్య, ఆగస్టు 17: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అనంతపురం, గుత్తి డివిజన్ల నుంచి 11 దరఖాస్తులు వచ్చాయి. గుత్తి డివిజన్ నుంచి 8, అనంతపురం డివిజన్ నుంచి ముగ్గురు దరఖాస్తు చేశారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగు టీచర్-1, ఇంగ్లీష్ టీచర్లు-4, ఫిజికల్ సైన్స్ టీచర్-1, సోషల్ టీచర్-1, ఎస్ఏ (వ్యాయామ విద్య)-1, సెకండరీ గ్రేడ్ టీచర్ల నుంచి రెండు, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు-1 దరఖాస్తులు వచ్చాయి. వీటినిపై జిల్లా ఎంపిక కమిటీ సభ్యులు పరిశీలిన చేస్తున్నట్లు విద్యాశాఖాధికారుల ద్వారా తెలుస్తోంది.

పుట్టపర్తికి పౌరవిమానయాన సేవలు
సీఎం చంద్రబాబుతో చర్చించిన కేంద్రమంత్రి



పుట్టపర్తి విమానాశ్రయం రన్‌వే

పుట్టపర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్ పోర్టుగా మార్చి పౌరవిమానాశ్రయ సేవలు ఎలా ప్రారంభించాలన్న విషయమై చర్చించామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాల అభివృద్ధి, ప్రధాన నగరాలతో ఎయిర్ కనెక్టివిటీ వంటి అంశాలపై ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చర్చించారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్ ఆర్గనైజేషన్‌లో ఉన్న పుట్టపర్తి సత్యసాయి బాబా విమానాశ్రయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రజా ఎయిర్ పోర్టుగా తయారు చేయగలితే ఆప్రాంతానికి రెగ్యులర్ విమానాల రాకపోకలు సాధ్యమవుతాయన్నారు. పుట్టపర్తి సత్యసాయి ఎయిర్ పోర్టును పౌర విమానాశ్రయంగా చేయాలన్న దిశలో చర్చలు నడుస్తుండటంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సార్..! మమ్మల్ని తీసుకెళ్లండి

- వ్యవసాయ శాఖ ఎంపీఈఓల వేడుకోలు
- ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న చిరుద్యోగులు
- సచివాలయ వ్యవస్థ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం
- అంతకుముందే అనంతకు తీసుకెళ్లాలని విన్నపం
- కూటమి ప్రభుత్వంలోనైనా ఊరట లభించేనా?



రైతు సేవా కేంద్రం

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరగకపోతుందా అని పలువురు వ్యవసాయశాఖ ఎంపీఈఓలు ఎదురు చూస్తున్నారు. నూతన ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో తమను పరిగణనలోకి తీసుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఉమ్మడి అనంత జిల్లాకు తీసుకురావాలని ఎంపీఈఓలు కోరుతున్నారు.

ఓడీపై చిత్తూరులో విధులు

టీడీపీ పాలనలో 2015 సంవత్సరంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్) కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక చేశారు. అప్పట్లో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ శాఖ తరపున క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ వచ్చారు. అయితే వైసీపీ సర్కార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశు సంవర్ధక శాఖ తరపున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించింది. దీంతో ఎంపీఈఓలకు కష్టకాలం మొదలైంది. గతంలో ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పనిచేసేవారు. వీరిలో 175 మంది వీఏఏ పోస్టులకు ఎంపికయ్యారు. మిగలినవారు అలాగే ఉండిపోయారు. జనాభా ప్రాతిపదిగా పోస్టులు కేటాయించడంతో ఇక్కడ ఖాళీ పోస్టులు లేవన్న కారణంతో 2020లో 205 మంది ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ప్రస్తుతం వీరిలో 115 మంది ఉమ్మడి చిత్తూరులో పనిచేస్తున్నారు. మిగిలిన వారిలో అనారోగ్యం, ప్రసూతి సెలవులు, ఆర్థిక, కుటుంబ పరమైన సమస్యలతో ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేయలేక తిరిగి వచ్చారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే తమకు న్యాయం చేస్తారన్న ఆశతో ఎంపీఈఓల సంఘం నాయకులు, ఎంపీఈఓలు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, స్థానిక ఎమ్మెల్యేలకు తమను సొంత జిల్లాకు రప్పించడంతోపాటు తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఎంపీఈఓలను జిల్లాకు రప్పించడంపై అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఇటీవల జడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ ప్రస్తావించారు. తాజాగా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరులో పనిచేస్తున్న ఎంపీఈఓల్లో గుబులు మొదలైంది. క్రమబద్ధీకరణకు ముందే తమను అనంత జిల్లాకు తిరిగి రప్పించి, రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు తమకు జిల్లాలో స్థానాలు కేటాయించాలని ఆయా ఎంపీఈఓలు కోరుతున్నారు.

సిబ్బందిని జిల్లాకు రప్పించేందుకు గత నెలలో లేఖ

ఓడీపై చిత్తూరు జిల్లాకు సిబ్బందిని పంపకుండా జిల్లాలోనే కొనసాగించాలని ఎంపీఈఓల సంఘం నాయకులు అప్పటి ప్రజాప్రతినిధులకు అనేక సార్లు విన్నవించారు. ఉమ్మడి అనంత జిల్లాలో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓ పోస్టును కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. అయితే వారి ఆవేదనను ఎవరూ పట్టించుకోలేదు. గత నెల రెండో వారంలో జిల్లా వ్యవ సాయ శాఖ కార్యాలయం నుంచి ఓడీపై చిత్తూరులో పనిచేస్తున్న ఎంపీఈఓ లను తిరిగి జిల్లాకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు లేఖ పంపారు. తద్వారా జిల్లాలో ఈ పంట నమోదు, ఇతర రకాల పనులు సకాలంలో పూర్తి చేయడంతోపాటు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉందని అందులో పేర్కొన్నారు. ఆ లేఖ పంపే సమయానికి వ్యవసాయ శాఖ కమిషనర్‌గా హరికిరణ్ ఉన్నారు. గత నెల మూడో వారంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా ఢిల్లీరావు బాధ్యతలు చేపట్టారు. ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు రప్పించేందుకు ఇక్కడి నుంచి పంపిన ఫైల్ విషయాన్ని కమిషనరేట్ కార్యాలయ ఉన్నతాధికారులు కొత్త డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదని సమాచారం.

టెర్మినేట్ చేసిన సిబ్బంది సంగతేంటో..?

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై వెళ్లలేదన్న కారణంతో 50 మంది ఎంపీఈఓలను జిల్లా వ్యవసాయ యంత్రాంగం ఉద్యోగం నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ కొందరు ఎంపీఈఓలు ఓడీపై ఇతర జిల్లాలకు వెళ్లలేకపోయారు. అయితే ఆయా జిల్లాల్లో ఎవరినీ ఉద్యోగం నుంచి టెర్మినేట్ చేయలేదు. ఎప్పటికైనా సొంత జిల్లాలో పోస్టింగ్‌లు ఇవ్వకపోతారా..? అనే కారణంతో ఆయా జిల్లాల ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకోనట్లు తెలిసింది. అనంత జిల్లాలో ఓడీపై వెళ్లని సిబ్బందిని టర్మినేట్ చేయడంతో వారికి తీవ్ర అన్యాయం జరిగింది.



క్రమబద్ధీకరణకు ముందే జిల్లాకు రప్పించాలి

సచివాలయ వ్యవస్థ క్రమబద్ధీకరణకు ముందే ఓడిపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు రప్పించాలి. రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు మాకు జిల్లాలో స్థానాలు కేటాయించాలి. ఓడీపై ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందితో పాటు టెర్మినేట్ చేసిన సిబ్బందికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలి. ఈ ఏడాది మార్చి నెలలో ఎంపీఈఓల సర్వీస్ రెన్యువల్ చేయాల్సి ఉండగా ఇప్పటి దాకా పెండింగ్‌లో ఉంది. గత నాలుగు మాసాలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకొని న్యాయం చేయాలి.

\- రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు



అవసరం లేకున్నా ఓడీపై పంపారు

వైసీపీ హయాంలో అవసరం లేకుండానే జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. అప్పటి నుంచి అనేక సార్లు అప్పటి ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మాకు న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉంది. తక్షణమే ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలను జిల్లాకు రప్పించేలా చర్యలు తీసుకోవాలి. రైతు సేవా కేంద్రం సిబ్బంది చేసే పనులు మేము చేస్తున్నాం. వారితో సమానంగా వేతనాలు అందించి ఆదుకోవాలి.

\- శంకర్, ఎంపీఈఓల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు

బదిలీల ఫీవర్

- డీపీఓ ప్రభాకర్‌రావు బదిలీ తథ్యం..?
- ఆ స్థానంలో సూర్యనారాయణకు అవకాశం..?
- పంచాయతీల్లో బదిలీల కోసం సిబ్బంది పైరవీలు



డీపీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 17: జిల్లా పంచాయతీలో బదిలీల ఫీవర్ పట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పైరవీల ప్రక్రియ తారస్థాయికి చేరింది. ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు బదిలీ తథ్యమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి వెళ్లడానికి ఆయన కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర శాఖ కార్యాలయానికి వెళ్లిన ఆయన.. రాయలసీమలోని ఉమ్మడి అనంతపురం జిల్లా మినహా వేరే జిల్లాకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఎక్కువ శాతం చిత్తూరుకు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభాకర్‌రావు బదిలీపై వెళితే ఆ స్థానంలో డీపీఓగా రావడానికి కదిరి డీఎల్‌డీఓగా పనిచేస్తున్న మునుపటి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సూర్యనారాయణ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. జిల్లాకు చెందిన ఆర్థిక మంత్రి మాత్రం ఇంకా ఏమీ తేల్చనట్లు సమాచారం. ఆయన కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తే సూర్యనారాయణ డీపీఓగా తథ్యమన్న చర్చ జరుగుతోంది. డీఎల్‌పీఓల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. జిల్లా విభజన అనంతరం జిల్లా కేంద్రం డీఎల్‌పీఓ మినహా మిగిలిన కళ్యాణదుర్గం, గుంతకల్లు రెండు డివిజన్లు ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓలతోనే పాలన నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం గుంతకల్లుకు పెద్దవడుగూరు ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓగా ఉన్నారు. కళ్యాణదుర్గానికి బ్రహ్మసముద్రం ఈఓఆర్డీ వెంకటనాయుడు ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓగా ఉన్నారు. వీరిద్దరు కూడా జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మండల విస్తీర్ణాధికారులుగా వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. రెగ్యులర్ డీఎల్‌పీఓ ఎప్పుడు వస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. అనంతపురం డీఎల్‌పీఓగా ఉన్న సుమన జయంతి కూడా బదిలీ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పరిపాలనా అధికారిగా ఉన్న విశ్వనాథరెడ్డి బదిలీ తథ్యమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. గతంలో కడపలో పని చేసిన ఆయన ప్రస్తుతం అక్కడికే వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఆయన బదిలీపై వెళితే శ్రీసత్యసాయి జిల్లా డీపీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఓ ఇక్కడికి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా పంచాయతీ కార్యాలయంలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరిలో ఇద్దరికి ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి. దీంతో వారికి బదిలీ తప్పదని తెలుస్తోంది. ఇందులో ఒకరు ఇప్పటికే స్థానికంగా ఓ ప్రజాప్రతినిధి వద్ద పీఏగా చేరారు. మరో సీనియర్ అసిస్టెంట్‌ను పెనుకొండకు బదిలీ చేస్తారా..? లేదా పుట్టపర్తి డీపీఓ కార్యాలయానికి మారుస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇక్కడికి సీనియర్ అసిస్టెంట్లు లీలాబాయి, ఉషా వచ్చే అవకాశం ఉంది. డీపీఓ బదిలీ కాకపోతే కార్యదర్శుల బదిలీలు సాధ్యం కావు. స్థానిక ప్రజా ప్రతినిధుల సమ్మతితో వారికి కావాల్సిన పంచాయతీల్లో పాగా వేయడానికి కొందరు కార్యదర్శులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. గత మూడేళ్లుగా ఉన్నతాధికారి అండదండలతో అధికారం చలాయించిన వారు ప్రభుత్వం మారడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్న చర్చ జరుగుతోంది. ఏ అధికారి వచ్చినా స్థానిక ప్రజాప్రతినిధుల సమ్మతితో అనంతపురం రూరల్‌లో పలు పంచాయతీలకు కర్చీఫ్ వేసుకొని కొందరు కార్యదర్శులు ఎదురు చూస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
15 శాఖలకు అవకాశం... 31లోగా పూర్తికి గడువు

అనంతపురం టౌన్, ఆగస్టు 17: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు ఆమోదం తెలుపుతూ శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. 15 శాఖల బదిలీలకు మాత్రమే అవకాశం కల్పించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, రూరల్‌డెవలప్‌మెంట్, మునిసిపల్, పౌరసరఫరాలు, మైనింగ్, జియోలజీ అన్నిశాఖల్లో ఇంజనీరింగ్ విభాగాలు, దేవదాయ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్‌శాఖ, రిజిస్ట్రేషన్, కమర్షియల్, ఎక్సైజ్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలతోపాటు గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీలో అవకాశం కల్పించారు. సోమవారం నుంచి బదిలీలు మొదలుపెట్టి 31వతేదీలోగానే బదిలీల ప్రక్రియ ముగించాలని ప్రభుత్వం గడువు విధించింది. నిబంధనల మేరకు ఐదేళ్లు ఒకచోట పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీకావాల్సి ఉంటుంది. అంతకన్నాలోపు సర్వీస్ ఉన్నవారురిక్వెస్ట్ పెట్టుకుంటే బదిలీ చేస్తారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17: రూడ్‌సెట్ సంస్థలో స్వయం ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పురుషలకు కంప్యూటర్, ట్యాలీ, ఏసీ, ఫ్రిజ్ రిపేరీల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత శిక్షణతోపాటు భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు, పురుషులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు పేర్ల నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479లను సంప్రదించాలని కోరారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు పెరుగుతున్న నీటి మట్టం

బెళుగుప్ప, ఆగస్టు 17: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో ఎక్కువగా వుండటంతో నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం 0.543 టీఎంసీలు నీటి నిల్వ వుండి శనివారం 0.921 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోతే వేతనాల్లో కోత..!
ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం రూరల్, ఆగస్టు 17: ట్రాన్స్‌ఫార్మర్స్ చెడిపోతే సంబంధిత సెక్షన్ అధికారులు, ఉద్యోగుల వేతనాల్లో కోతలు ఉంటాయని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు జిల్లా విద్యుత్ అధికారులను హెచ్చరించారు. శనివారం జేఎన్‌టీయూరోడ్డులోని విద్యుత్‌శాఖ ప్రధానకార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఆ శాఖ రెవెన్యూ సీజీఎం ధర్మజ్ఞాని, ఎస్ఈ సంపత్‌కుమార్‌తో కలసి ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విద్యుత్ అంతరాయాలు తగ్గించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆదేశించారు. విద్యుత్‌లైన్లు టిమ్ చేసుకోవాలని సూచించారు. ప్రీమాన్‌సూన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ లోడ్ అధిగమించేందుకు కొత్త లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు త్వరిగతిన రిలీజ్ చేయాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌పై కరపత్రాలు పంపిణీ చేయించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లు, బకాయిలు త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు.

అవినీతి వెలుగు

- వైసీపీ హయాంలో రూ.2 కోట్లు దోచేశారు
- వ్యవహారం బయటకు పొక్కనివ్వని సిబ్బంది
- కూటమికి అధికారంతో అక్రమార్కుల్లో గుబులు



కళ్యాణదుర్గం, ఆగస్టు 17: వైసీపీ హయాంలో కళ్యాణదుర్గం వెలుగు కార్యాలయంలో అవినీతి ఒక్క వెలుగు వెలిగింది. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దాదాపు రూ. రెండు కోట్ల స్త్రీ నిధి సొమ్మును స్వాహా చేశారు. మహిళలు స్వయం ఉపాధి కోసం ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు స్త్రీ నిధి సొమ్మును మహిళా సంఘాల సభ్యులకు మంజూరు చేస్తారు. వెలుగు ఏపీఎం, సీసీ సంతకాలు చేసిన తర్వాత స్త్రీ నిధి సొమ్ము మహిళా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ అవుతుంది. అయితే ఏపీఎం, సీసీ అనుమతులు పొందిన తర్వాత ఆ సొమ్ము మహిళా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమకాకుండా.. వైసీపీ నాయకులు ఖాతాల్లో జమ అయింది. వైసీపీ హయాంలోనే ఇలా కళ్యాణదుర్గం మండలం హులికల్లు, మల్లికార్జునపల్లిలో స్త్రీ నిధి సొమ్ము స్వాహా అయింది. బ్యాంకుల వద్దకు వెళ్లి మహిళల అకౌంట్‌ను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే అవినీతికిపాల్పడిన వారు వైసీపీకి చెందిన వారు కావడంతో వారి జోలికి వెళ్లవద్దని ఆ పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. దీంతో ఆ అధికారులు నాడు మిన్నకుండిపోయారు. ఆ గ్రామాల వైపు కనీసం కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ అవినీతిని వెలికి తీయాలని ఆ గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు ఒత్తిడి చేశారు. దీంతో ఇప్పుడు ఆ గ్రామాల్లో అవినీతిని వెలికితీయడానికి వెలుగు అధికారులు పరుగులు తీస్తున్నారు. వెలుగు కార్యాలయంలోనే ఈ అవినీతి ఆజ్యం పోసినట్లు తెలుస్తోంది. వెలుగు కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఆ బ్యాంక్ ఉద్యోగి ఒక్కటై స్త్రీ నిధి సొమ్మును డ్రా చేశారనే ఆరోపణలున్నాయి. ఇంత అవినీతి జరిగినా.. నాడు పనిచేసిన వెలుగు ఏపీఎం, సీసీలు ఏమి చేశారో తెలియని పరిస్థితి. వారి తీరు అనుమానాలకు తావిస్తోంది. స్త్రీ నిధి సొమ్ముతో వైసీపీ నాయకులు, వెలుగు అధికారులు జేబులు నింపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఈ రెండు గ్రామాల్లోనే కాదు.. మండలంలో చాలాచోట్ల ఇలాంటి అవినీతే బహిర్గతం అవుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రశ్నించే వారే ఉండరనే ధీమాతో అక్రమార్కులు అందినకాడికి దోచుకున్నారు. నాడు వైసీపీ నాయకులు చెప్పినట్లు చేసినప్పటికీ, ఇప్పుడు అధికారుల మెడకు చుట్టుకుంటోంది.

ఉద్యాన పథకాలపై రైతులకు అవగాహన కల్పించండి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: ఉద్యాన పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు ఆదేశించారు. స్థానిక ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది జిల్లాకు ఎంఐడీహెచ్ పథకం కింద రూ.14.53 కోట్లు, ఆర్‌కేవీవై కింద రూ.1.29 కోట్లు, ఇతర పథకాలకు రూ.1.01 కోట్లు మొత్తం రూ.16.83 కోట్లు లక్ష్యంగా ప్రభుత్వం విధించిందన్నారు. ఆయా పథకాలకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునేలా క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడుశనివారాల వ్రతం



పూజలందుకుంటున్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 17: ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా ఐదవ శనివారం నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయం, రామ్‌నగర్ వెంకటేశ్వర ఆలయం, అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమం, వేణుగోపాల్ సద్గురు సాయినాథ మందిరాల్లో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు. ఆయా ఆలయాల కార్యవర్గాలు, భక్తులు పాల్గొన్నారు.



వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

ఘనంగా శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి మూలవిరాట్‌లు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 17: మండలంలోని చిన్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రెండురోజల పాటు వివిధ అభిషేకాలు, హోమాలు నిర్వహించిన అనంతరం ఆలయంలో స్వాముల విగ్రహాల ప్రతిష్ఠను వేదపండితుల మంత్రోచ్చారణల నుడమ చేపట్టారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించి దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతుగా సహాయసహకారాలు అందించడానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకుడు కేవీ శ్రీధర్, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి పాల్గొన్నారు.

పంటల బీమాను వెంటనే ప్రకటించాలి



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 17: 2023 సంవత్సరానికి సంబంధించి పంటల బీమాను వెంటనే ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ... 2023 ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని నష్టపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలను, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ కరువు నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదన్నారు. వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి, ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, శివారెడ్డి, పోతులయ్య, చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, సుబ్బయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం



ఎంజీఎం కాలనీ వద్ద బురదను తొలగిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చొరవతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి డ్రైనేజీ నీరు రోడ్లపై చేరుకున్న బురద క్లీన్ అయ్యింది. 41వ డివిజన్‌తోపాటు పలు కాలనీల్లో రాత్రి వర్షానికి కాలనీలో బురద నీరు చేరింది. స్థానికులు ఎమ్మెల్యేకు ఫోన్ చేసి విషయం తెలియజేయగానే ఆయన స్పందించారు. మరో మూడు రోజులు వర్ష సూచన నేపథ్యంలో నగర పాలక, విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 17: మండలంలోని జంతులూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రామవేంద్ర వివాహానికి మాజీ సర్పంచ్ రామానాయుడు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ పంచాయతీలో టీడీపీలోని కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు.

జిల్లా అధికారులకు రాఖీ శుభాకాంక్షలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 17: రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు జిల్లా అధికారులకు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం కలెక్టర్ వినోద్ కుమార్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు, డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్‌లకు బ్రహ్మకుమారి శారద వారి కార్యాలయాల్లో కలిసి, రాఖీ కట్టడంతోపాటు మిఠాయిలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పీవీకేకేలో పల్లె ఉమా జయంతి

అనంతపురంరూరల్, ఆగస్టు17: స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో పల్లె ఉమా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ పల్లెకిశోర్, కరస్పాండెంట్ పల్లె రఘునాథ్‌రెడ్డి, కోశాధికారి పల్లె సింధూరా రెడ్డి తదితరు కుటుంబ సభ్యులు కళాశాలలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులు కేక్ కట్ చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విజయవంతమైన మగవాడి వెనక ఖచ్చితంగా ఒక మహిళ ఉంటుందన్నారు. శ్రీ బాలాజీ విద్యాసంస్థల్లో వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తూ అనేక రంగాల్లో ఉన్నత స్థాయిల్లో స్థిరపడటానికి పల్లె ఉమా ఎంతో కృషి చేశారన్నారు. పల్లె ఉమా జయంతిని పురస్కరించుకుని కళాశాల సిబ్బంది పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, విశ్రాంత ఆర్ఐఓ పల్లె రామకృష్ణారెడ్డి, ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, పీవీకేకే ఐటీ ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, డీన్ సంతోష్‌రెడ్డి, ఏఓ మనోహర్‌రెడ్డి, డిప్లమో ప్రిన్సిపల్ వైభవ్, శ్రీబాలాజీ పీజీ కళాశాల ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మదేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

బహిరంగంగా ఉరి తీయాలి

● వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా విద్యార్థి సంఘాల ఆందోళన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు17: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను బహిరంగంగా ఉరితీయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐఎస్‌బీ, వీఎస్ఐవీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పలువురు జూనియర్ వైద్యులు, విద్యార్థులు టవర్‌క్లాక్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఏఐఎస్‌బీ జిల్లా ప్రధానకార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి, వీఎస్ఐవీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రోజురోజుకు మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. ఈ హత్యలో కీలక వ్యక్తులు ఉన్నారనేది యావత్ భారతదేశానికి అర్థమవుతోందన్నారు. నిందితులను వెంటనే బహిరంగంగా ఉరితీయాలన్నారు.

వైద్యులకు రక్షణకు కఠిన చట్టాలు రూపొందించాలి

అనంతపురం సెంట్రల్: వైద్య విద్యార్థులు, వైద్యులకు రక్షణగా కఠిన చట్టాలు రూపొందించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. శనివారం కోల్‌కతలో వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ పీడీఎస్‌ఓ, ఏబీవీపీ నాయకులు వేరువేరుగా ర్యాలీ నిర్వహించారు. పీడీఓస్‌ఓ మల్లీశ్వరి, అస్రఫ్‌వలి, ఏబీవీపీ యచేంద్ర, అఖిల్, జశ్వంత్, అశ్వర్థ, సంపత్, అభి, సుధీర్, విజయ్, నితిన్ పాల్గొన్నారు.

ఆర్డీటీలో కొవ్వొత్తుల ప్రదర్శన

అనంతపురం క్లాక్‌టవర్: మహిళలకు రక్షణ కల్పించాలని, కోల్‌కతా మహిళా డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా శనివారం సాయంత్రం స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్‌లతో పాటు ఉద్యోగులు శాంతియుతంగా కొవ్వొత్తులను ప్రదర్శించారు.

శింగనమల: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం దారుణమని తరిమెల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. శనివారం వైద్య సిబ్బందితో కలిసి ఆరోగ్య కేంద్రం ఎదుట హత్యాచార నిందితులను వెంటనే శిక్షించాలని నిరసన వ్యక్తం చేశారు. శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని సిబ్బంది ఆంజనేయలు నాయక్. రంగనాయకులు, రమ్యతేజ, మానస, పుష్పలత ర్యాలీ చేపట్టి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు.



గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

అనంతపురం న్యూటౌన్: కోల్‌కతా ప్రభుత్వ ఆస్పత్రిలో నైట్‌డ్యూటీలో ఉన్న వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ఇచ్చిన పిలుపునకు మద్దతుగా జిల్లా కేంద్రంలోని శ్రీనేత్ర వైద్యశాల వైద్యులు, సిబ్బంది కొవ్వొత్తులతో సంఘీభావం తెలిపారు. వైద్యశాల యాజమాన్యం దాదాగాంధీతో పాటు వైద్యులు కేదార్‌నాథ్, కిరణ్, రూహియా, దివ్యశ్రీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వైద్యాధికారి శివకృష్ణ, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ డిమాండ్ చేశారు. వైద్యురాలి హత్యకు నిరసనగా రాప్తాడులో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండు వరకూ ర్యాలీ చేపట్టారు. ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ నరసింహ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ, ఏబీవీపీ నాయకులు



రాప్తాడులో...



తరిమెలలో మానవహారంగా ఏర్పడ్డ వైద్యులు, సిబ్బంది

వయనాడ్ బాధితులకు విరాళం

అనంతపురం ప్రెస్‌క్లబ్/కల్చరల్, ఆగస్టు 17: కేరళ రాష్ట్రం వయనాడ్‌లో సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితుల సహాయార్థం జిల్లా పెన్షనర్ల సంఘం నాయకులు విరాళం అందజేశారు. శనివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో అధ్యక్ష కార్యదర్శులు పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప చేతులమీదుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్‌కు రూ.10వేల చెక్కును అందజేశారు. సంఘం సభ్యులు సూర్యనారాయణ, మధుసూదన్, అనంతయ్య, మురళి పాల్గొన్నారు.

చిన్నారి శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 17: పుట్టుకతోనే మలద్వార రంధ్రం లేక సమస్యలెదుర్కొంటున్న చిన్నారి శస్త్రచికిత్సకోసం ఆర్థికసాయం అందించి అమ్మ సంస్థ అండగా నిలిచింది. నగరానికి చెందిన ఆటో డ్రైవర్ శివ, జయలక్ష్మి దంపతులకు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. వారిలో చిన్నకుమార్తె ఆరు సంవత్సరాల నేత్రకు పుట్టుకతోనే మలద్వార రంధ్రం లేకపోవడంవల్ల ఇప్పటికే మూడు పర్యాయాలు కొలస్టమీ శస్త్ర చికిత్స చేయించారు. మూడు పర్యాయాలూ శస్త్ర చికిత్స వికటించడం వల్ల ఆ కుటుంబం ఆర్థికంగా బలహీన పడింది. చివరగా నగరంలో చిన్నపిల్లల డాక్టర్ హరిప్రసాద్‌ను సంప్రదించగా రూ.60వేలు ఖర్చవుతుందన్నారు. దీంతో దాతల సాయంకోసం కుటుంబం అమ్మ సంస్థను ఆశ్రయించగా సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శనివారం ఆస్పత్రికి చేరుకుని వైద్యుడిని సంప్రదించగా రూ.25వేలు తగ్గించారు. చిన్నారికి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

గార్లదిన్నె, ఆగస్టు 17: గ్రామీణ ప్రాంతాల పేదలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని జాతీయ నాణ్యత నిపుణుల వైద్యాధికారులు బిందు, భాగ్యవతి, యుతీశ్ సూచించారు. శనివారం మండలంలోని పెనకచెర్ల గ్రామంలోని హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను బృందం సభ్యులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పేదలకు అందిస్తున్న సేవలు, జాతీయ ఆరోగ్య పథకాల అమలుపై వారు ఆరా తీశారు. అనుసంధాన అధికారి స్టీఫెన్, వైద్యాధికారి మనీష, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, వైద్య సిబ్బంది అరుణ జ్యోతి, ఏఎస్ఎమ్ దుర్గాభవాని పాల్గొన్నారు.

ఘనంగా విలియం కేరి జయంతి



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న పాస్టర్లు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 17: విలియం కేరి 263వ జయంతిని శనివారం స్థానిక యేసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటి స్వామిదాస్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విలియం కేరి విదేశీయుడైనా మన ఆధ్యాత్మిక, ఆర్థిక, మానసికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన మహనీయుడన్నారు. రాయలసీమ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జెట్టి ప్రభుదాస్, అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే కృపదాసు, ఉపాధ్యక్షుడు ఆంథోని, కార్యదర్శి డేనియల్, రాజేష్‌కుమార్, వినయ్ పాల్గొన్నారు.

వాటర్‌బాటిల్ షాపుపై కేసు నమోదు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 17: అధిక ధరలకు విక్రయిస్తున్న ఆర్టీసీ బస్టాండులోని ఓ కూల్‌డ్రింక్ షాపుపై తూనికలు, కొలతల శాఖాధికారులు కేసు నమోదు చేశారు. శనివారం అధిక ధరలకు వాటర్ బాటిళ్లను విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ సిబ్బందితో కలిసి బస్టాండులోని పలు షాపులపై తనిఖీలు నిర్వహించారు. ఎమ్మార్పీ ధర కన్నా అదనపు ధరలకు విక్రయిస్తున్న ఓ దుకాణాదారుడిపై కేసు నమోదు చేశారు. తదుపరి చర్యలు నిమిత్తం జరిమానాలు విధిస్తామని ఆయన తెలిపారు.

సమస్య పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు17: మాజీ సైనికులు, వారి వితంతువుల సమస్యల పరిష్కారం కోసం 22వ తేదీన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన ఉమ్మడి జిల్లాలోని మాజీ సైనికులు, వారి వితంతువులు సమావేశానికి హాజరై సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చన్నారు. ప్రతి మాజీ సైనికుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయం 08554-241146 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మంత్రి పయ్యావులను కలిసిన జడ్పీ సీఈఓ

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను జడ్పీ సీఈఓ ఓబుళమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం జడ్పీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమె స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

గార్లదిన్నె, ఆగస్టు 17: మండలంలోని కల్లూరు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఎంసీ) కమిటీ ఎన్నికలు ముగిశాయి. 8న ఎన్నికలు నిర్వహించగా 45 పాఠశాలలకు గాను 44లో ఎన్నికలు జరిగాయి. కల్లూరు పాఠశాలలో కోరం లేకపోవడంతో వాయిదా పడింది. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్‌గా ఆటో ఎర్రిస్వామి, వైస్ చైర్‌పర్సన్ మల్లేశ్వరీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్, వైస్ చైర్‌పర్సన్లకు మండల విద్యాశాఖాధికారి తారా చంద్రానాయక్ డిక్లరేషన్ ఫారంను అందచేశారు. ప్రధానోపాధ్యాయులు శారదబాయి, రైస్‌మిల్ వెంకట్రాముడు, బాబయ్య, జంగం నరసింహయాదవ్, సుధాకర్‌రెడ్డి, వడ్లరాము, సామాల మధు, చెక్క నాగేష్, ఆశోక్, తిరుపాల్, శ్రీనాథ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వడ్డుపల్లి, తోపుదుర్తి విద్యాకమిటీ ఏకగ్రీవం

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి తోపుదుర్తి ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీని శనివారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. వడ్డుపల్లి పాటశాల కమిటీ చైర్‌పర్సన్‌గా చర్మిని, వైస్ చైర్మన్‌గా గంగన్న, తోపుదుర్తి ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్‌గా పోలన్న, వైస్ చైర్మన్‌గా నారామూర్తి నిర్మల ను ఎన్నకున్నారు

మరోసారి వాయిదా

నార్పల: మండల కేంద్రంతోపాటు నడిమిదొడ్డి గ్రామంలో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు రెండోసారీ వాయిదా పడ్డాయి. నార్పల బాలికల పాఠశాల, నడిమిదొడ్డి ప్రాథమిక పాఠశాల ఎన్నికలు నిర్వహించగా కోరమ్ లేక వాయిదా వేసినట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. ఎన్నికలను డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్ ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

వైసీపీ రాజ్యాంగాన్ని పాటిస్తున్న విద్యుత్ అధికారులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 17: ప్రజలకు సేవలందించాల్సిన విద్యుత్ శాఖ అధికారులు వైసీపీ ప్రభుత్వం దిగిపోయినా ఆపార్టీ రాజ్యాంగాన్ని పాటిస్తూ నాయకుల సేవలో తరిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి మండిపడ్డారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సీఎండీ సంతోష్ రావును కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ బుక్కరాయసముద్రం రేకలకుంట గ్రామ సమీపంలో వైసీపీ నాయకునికి చెందిన స్పిరిట్ ఫ్యాక్టరీకి మెయిన్‌లైన్ ద్వారా విద్యుత్‌ను అందిస్తున్నారన్నారు. గ్రామంలో లైన్ వెళ్లడంతో మా ప్రాణాలకు ప్రమాదముందని విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని మండిపడ్డారు. సమస్యను పరిష్కరించాలని సీఎండీకి విన్నవించారు. నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, కాటమయ్య, రామాంజినేయులు, కదరయ్య, పోతులయ్య పాల్గొన్నారు.

జిల్లాకు ఇద్దరు డీఈఈల కేటాయింపు

అనంతపురంరూరల్, ఆగస్టు 17: జిల్లా విద్యుత్ శాఖకు ఇద్దరు డిప్యూటీ ఈఈలను కేటాయిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న చంద్రశేఖర్, ఎస్.రామకృష్ణ అనే ఇద్దరు అధికారులను కేటాయించారు. ఆమేరకు జిల్లా ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుత్తి డీఈఈకి ఉరవకొండ బాధ్యతలు

అనంతపురం, సిటి, ఆగస్టు17: ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని గుత్తి పీఆర్ఐ డివిజన్ డీఈఈగా పనిచేస్తున్న మురళీధర్‌కు అదేశాఖ పరిధిలోని ఉరవకొండ పీఆర్ఐ ఇన్‌చార్జి డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆశాఖ ఎస్ఈ కేవీకేవీ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. ఇప్పటి వరకు ఉరవకొండ ఇన్‌చార్జి డీఈఈగా పనిచేస్తున్న అరుణ్‌కుమార్ అనంతపురం పీఆర్ఐ డివిజన్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో అరుణ్‌కుమార్ కూడా శనివారం సాయంత్రం ఉరవకొండ డీఈఈ బాధ్యతలు నుంచి తప్పుకున్నారు.

25న బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17: బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25వతేదీన న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మోహిద్దీన్, కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు యూనిఫాం, క్రీడాసామగ్రి, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: ప్రస్తుతం కురిసిన వర్షాలకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని అనంతపురం ఏడీఏ రవి ఒక ప్రకటనలో సూచించారు. అనంతపురం డి విజన్ పరిధిలోని మండలాల్లో పదును వర్షం పడింది. ఇదివరకు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులు వారి పొలాల్లో ఉలవ, అలసంద, కొర్రలు, పెసలు తదితర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

రాప్తాడు, ఆగస్టు 17: నియోజకవర్గంలో 20వ తేదీ నుంచి కొత్త ఓటర్లు, పాత ఓటర్ల జాబితాలో సవరణకు ఈసీ షెడ్యూల్ ప్రకటించిందని అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆర్ఓ వసంతబాబు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 20వ తేదీ నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు పూర్తయిన వారిని ఓటర్లగా నమోదు చేస్తారన్నారు.

వామ్మో.. కక్కలపల్లి రోడ్డా..!

● వర్షానికి బురదమయమైన రోడ్డు

అనంతపురం రూరల్, ఆగస్టు 17: మండలంలోని కక్కలపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డంతా బురదమయమైపోయింది. దీంతో ఆ రోడ్డు గుండా ప్రయాణం సాగించే ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కక్కలపల్లి క్రాస్ మొదట్లో రోడ్డంతా గుంతలమైపోయింది. టమోటా మార్కెట్ నుంచి కొంత సీసీ రోడ్డు వేయడంతో కాస్త బాగానే ఉన్నా.. ఆ తరువాత రోడ్డు అంతా అధ్వానంగా ఉంది. రోడ్డులో పెద్దగుంతలు కనిపిస్తున్నాయి. దీనికితోడు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డంతా బురదమైపోయింది. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మట్టిరోడ్డు వేశారు. ఇది మంచిదే అయినా..మార్కెట్‌కు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. ఈక్రమంలో రోడ్డులో మళ్లీ గుంతలు పడ్డాయి. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు రోడ్డు వేస్తే ఉపయోగం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మార్కెట్‌కు టోల్ వసూలు చేస్తే..: టమోటా మార్కెట్ ద్వారా పంచాయతీకి సుంకం వసూళ్ల నేపథ్యంలో ఆదాయం సమకూరేది. టోల్ వసూలుకు వేలం వేయడం ద్వారా రూ.అరకోటి వరకు పంచాయతీకి ఆదాయం వచ్చేది. గత ఏడాది నుంచి టోల్ వసూలు వేలం బంద్ చేసేశారు. వాహనాలనుంచి టోల్ వసూలు చేయకూడదని సంబంధిత అసోసియేషన్ సభ్యులు కోర్టు ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో పంచాయతీ అధికారులు టోల్ వసూలు వేలం నిలిపివేశారు. కనీసం ఆ నిధులైన ఉంటే ప్రధాన రోడ్డు వేసుకునేందుకు వీలుండేదీ.



బురదమయమైన కక్కలపల్లి రోడ్డు

బంగ్లాదేశ్ హిందువులకు అండగా నిలుద్దాం



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 17: బంగ్లాదేశ్ హిందువులకు దేశ ప్రజలు అండగా నిలవాలని హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దారుణాలపై శనివారం హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీకి బీజేపీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ప్రసాద్, హిమకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బాధితులకు సంఘీభావంగా దేశ పౌరులు ముందుకు రావాలని కోరారు. గొంది అశోక్, అశోక్‌రెడ్డి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

మెనూను సవరించి ఆదుకోండి

● ఎస్సీ వెల్ఫేర్ డీడీకి వార్డెన్ల సంఘం నేతల వినతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 17: ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూను సవరించాలని ఎస్సీ హాస్టల్ వార్డెన్ల సంఘం నాయకులు ఆ శాఖ డీడీ కుష్బూకొఠారీని కోరారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామునాయక్ పలువురు వార్డెన్లతో కలిసి డీడీ చాంబర్లో ఆమెకు సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూను సవరించాలన్నారు. లేనిపక్షంలో మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచేందుకు అధికారులకు తెలియజేయాలన్నారు. వసతిగృహాల్లోని ల్యాప్‌టాప్‌లు, బయోమెట్రిక్ డివైజ్‌లు సరఫరా చేసి 8 సంవత్సరాలు కావస్తుండటంతో... అవి సక్రమంగా పనిచేయడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులను త్వరితగతిన చెల్లించే విధంగా రాష్ట్రస్థాయి అధికారులకు సిఫార్సు చేయాలని కోరారు. డీడీని కలిసిన వారిలో నాగార్జున రెడ్డి, లక్ష్మీనారాయణ, నందమోహన్ ఉన్నారు.

వన్‌టౌన్ సీఐ రిలీవ్

అనంతపురం క్రైం,ఆగస్టు 17: వన్‌టౌన్ సీఐ సీటు హాట్ సీట్‌గా మారింది. సీఐ రెడ్డప్ప శనివారం రిలీవ్ అయ్యారు. రెండు రోజుల క్రితం ఆయనను శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం టూటౌన్ సీఐగా బదిలీ చేశారు. కానీ ఇంకా ఆ సీటుకు ఎవరినీ నియమించ లేదు. ఈ సీటుకు పోటీ ఉండటమే కారణంగా తెలుస్తోంది. సీఐ రెడ్డప్ప నూతన సీఐను నియమించేవరకు రిలీవ్ కారనే ప్రచారం జరిగింది. కానీ శ్రీ సత్యసాయి జిల్లాల పోలీస్ అధికారులు జాయినింగ్ రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆయన రిలీవ్ అయినట్లు తెలుస్తోంది.

హాట్ సీట్‌గా...: అనంతపురం వన్‌టౌన్ సీఐ సీటుకు ఫుల్ డిమాండ్ ఉంది. ఇప్పటికే పలువురు అధికారులు పోటీలో ఉన్నారు. కొందరు పోటీలోకి వచ్చినా తెరపైకి రాకుండానే వెళ్లిపోయాయి. తొలుత రాజా పేరు వినిపించినా...ఆ మేరకు సిఫార్సులు వచ్చినా ఆయనను నియమించలేదు. ఆయనను ఉన్నతాధికారులే వ్యతిరేకించినట్లు సమాచారం. దీంతో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య పేరు తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఆయనను వీఆర్‌కు తీసుకొచ్చారు. దీంతో ఆయనే వస్తారా..?లేక మరో కొత్త పేరు వినిపిస్తుందా..? అనేది చర్చనీయాంశంగా మారింది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



నాగార్జున రెడ్డి(ఫైల్)

నార్పల, ఆగస్టు 17: మండలంలోని నడిమిదొడ్డి గ్రామంలో శనివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై నాగార్జున రెడ్డి(32)అనే యువకుడు మృతి చెందాడు. నాగార్జున రెడ్డి తోట పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. ఇంట్లో ట్యాంక్‌లో నీరు అయిపోవడంతో మోటారు ఆన్ చేయడానికి స్విచ్ ముట్టుకోగానే విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలో వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమత్తం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నాగార్జునరెడ్డికి భార్య ఝాన్సీ, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపాడు.

ప్రైవేటు బస్సు బోల్తా...



జాతీయ రహదారిపై బోల్తాపడిన ప్రైవేటు బస్సు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 17: చెన్నేకొత్తపల్లి జాతీయరహదారిపై శనివారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు బస్సు బోల్తాపడిన ఘటనలో పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ నుంచి 33 మంది ప్రయాణికులతో ప్రైవేటు బస్సు బెంగళూరుకు వెళుతోంది. చెన్నేకొత్తపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి బస్సు రోడ్డుపైనే బోల్తాపడింది. డ్రైవర్ రమేష్‌తో పాటు పలువురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు బస్సులో ఉన్నవారిని అద్దాలు పగలగొట్టి బయటకు తీసుకువచ్చారు. రోడ్డుపైన బస్సు బోల్తాపడటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రెండులైన్ల రోడ్డు ద్వారా వాహనాల రాకపోకలను కొనసాగించారు. క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సును పక్కకు తరలించి యధావిధిగా వాహనాల రాకపోకలను కొనసాగాయి. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ అనూరాధ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాద వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు.


గుంతకల్లులో వైద్యులు, సిబ్బంది ర్యాలీ


తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న వైద్యులు


కళ్యాణదుర్గంలో వైద్యులు, వైద్యసిబ్బంది ర్యాలీ


రాయదుర్గంలో నిరసన ప్రదర్శన

రేపిస్టులను కఠినంగా శిక్షించాలి

● కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్యపై వెల్లువెత్తిన నిరసనలు
● ఆందోళనలు, ర్యాలీలు చేపట్టిన వైద్యులు, సిబ్బంది, పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 17: కోల్‌కత్తాలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం చేయడంతో పాటు హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని గుంతకల్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు, పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో శనివారం గుంతకల్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. స్థానిక అజంతా సర్కిల్ నుంచి గాంధీ విగ్ర హం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందుకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడ్, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు, ఆ నలుగురు సేవా సమితి సభ్యులు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు. తర్వాత గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అసోసియేషన్ వైద్యులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యుల మాన, ప్రాణాలకు రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఆస్పత్రులలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వైద్యులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. సాయంత్రం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కీర్తికిరణ్‌రెడ్డి, కార్యదర్శి జిలాన్, సభ్యులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఆయుర్వేదిక్ వైద్యవిద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలో తాడిపత్రి ఇండియన్ మెడికల్, డెంటల్ అసోసియేషన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద నుంచి అశోక్‌పిల్లర్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అసోసియేషన్ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిని అమానవీయంగా అత్యాచారం, హత్య చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ థామస్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులపై దాడులకు పాల్పడేవారికి కేంద్రప్రభుత్వం చట్టాలను కఠినతరంగా రూపొందించాలన్నారు. అనంతరం ఈమేరకు డీటీ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ర్యాలీలో తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ రమేష్‌రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్, వైద్యులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రి వైద్యులు ర్యాలీ చేపట్టారు. ఆసుపత్రి నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి. కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటన లు జరగకుండా కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వైద్యులు గంగాధర్, అర్జున్, సాహితి, వినీత, కుముద, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం, రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ప్రభుత్వ వైద్యశాల నుంచి బస్టాండ్ మీదుగా వినాయక సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. అక్కడ ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి మాట్లాడుతూ ప్రజా సేవలో ఉండే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. తక్షణమే దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు మోహన్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినాయకసర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడు క్రాంతికృష్ణ, జిల్లా సహాయక కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనలో న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. నాయకులు దుర్గన్న, తిప్పేస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, వైద్యసిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఆస్పత్రి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ఎల్లప్ప, ఎల్లారాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: మండలకేంద్రంలో మండల వైద్యులు, సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జూనియర్ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తిక్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఆర్ఎంపీ డాక్టర్లు, పాల్గొన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యురాలు హిమబిందు, సిబ్బంది ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

కణేకల్లు: మండలకేంద్రంలో వైద్యులు, వైద్యసిబ్బంది ఆందోళన నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. వైద్యులు నిరీష, చంద్రమనోహర్, మహేంద్ర, చంద్రశేఖర్‌నాయక్, పావని, రాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. జూనియర్ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యాధికారి గీతాభార్గవి, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో వైద్యులు, వైద్యసిబ్బందిస్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ఫ్లకార్డులు చేతపట్టి, నల్లరిబ్బన్లు ధరించి టీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డివిజన్ సెక్రెటరీ డాక్టర్ రాజేష్, ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల మాధవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలో వైద్యులు, సిబ్బంది, ఆర్ఎంపీ ఆర్ఎంపీ వైద్యులు కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి కెనరా బ్యాంకు ముందు మానవహారంగా ఏర్పడి ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో కుందుర్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలో ఆశా వర్కర్లు, ఆర్ఎంపీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలకేంద్రంలో వైద్యాధికారులు, వైద్యసిబ్బంది ఫ్లకార్డులు ధరించి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు రమేష్, బాలాజీనాయక్, సీహెచ్ఓ మురళి, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలో వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో ర్యాలీ జరిపారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. శ్రీరంగాపురం పీహెచ్‌సీ వైద్యుడు లోకేష్‌కుమార్, వైద్యురాలు ప్రియాంక, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంపీహెచ్ఈవో విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపునీరు చెరువులకు చేరేలా చూడాలి

● అధికారులకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ఆదేశం


పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పుట్లూరు, ఆగస్టు 17: వర్షపునీరు వృథా కాకుండా పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హెచ్చెల్సీ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఏ. కొండాపురం గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా వరదనీరు వృథాగా వెళుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో పలుచోట్ల కాలువలు గండి పడ్డాయని, వాటిని పూడ్చి చెరువులకు నీరు చేరేలా చూడాలని అన్నారు. పాఠశాలతో పాటు పలు ఇళ్లల్లోకి వర్షపునీరు చేరడాన్ని పరిశీలించారు. ఇళ్లలో నీళ్లు చేరిన బాధితులకు నిత్యావసర సరుకులు అందజేసి ప్రభుత్వ సాయం కోసం నివేదికలు పంపాలని తహసీల్దార్ శేషారెడ్డిని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ యోగానందరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు


ఉదిరిపికొండలో నూతన సభ్యులతో టీడీపీ నాయకులు

కూడేరు, ఆగస్టు 17: మండలంలోని ఉదిరిపికొండ గ్రామంలో వాయిదా పడ్డ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ ప్రాథమికొన్న పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. మండల వ్యాప్తంగా 37 ప్రభుత్వపాఠశాలలు ఉండగా ఈనెల 8వ తేదీన 36 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. అందులో 35 చోట్ల టీడీపీ మద్దతుదారులు, ఒకచోట జనసేన మద్దతుదారు గెలిచారు. ఉదిరిపికొండ గ్రామ పాఠశాల ఎన్నికలు మాత్రం వాయిదా పడ్డాయి. ప్రభుత్వం 17న ఎన్నికలు జరపాలని ప్రకటించింది. దీంతో ఎన్నికలు జరగ్గా టీడీపీ మద్దతుదారులైన బోయ రవికుమార్ ను చైర్మన్‌గా, హెచ్. సరోజమ్మను వైస్ చైర్మన్‌గా కమిటీ సభ్యులు ఎన్నుకున్నట్లు హెచ్ఎం హరిశ్రీ ప్రకటించారు.

రెండు పాఠశాలల్లో ఏకగ్రీవం

కుందుర్పి: మండలంలోని మహంతపురం, నిజవల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల ఎస్ఎంసీ ఎన్నికలు కొన్ని పరిస్థితుల వల్ల వాయిదాపడ్డాయి. కాగా శనివారం ఈ రెండు చోట్ల ఎన్నికలు నిర్వహించగా టీడీపీ మద్దతు దారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బొమ్మనహాళ్, ఆగస్టు 17: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో మూడురోజుల క్రితం గ్రామానికి చెందిన టీడీ పీ నాయకుడు పూరి రామాంజనేయులు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శనివారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే అదే గ్రామంలో డోనేకల్ రామాంజనేయులు అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, "సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున తదితరులు ఉన్నారు.

రేపు మెగా వైద్యశిబిరం

తాడిపత్రి, ఆగస్టు17: పట్టణంలోని భగవాన్ రమణమహర్షి ఆశ్రమంలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సంజీవరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం సవేరా ఆసుపత్రి వారు శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు చేస్తారన్నారు. గుండె, ఎముకలు, కంటికి సంబంధించిన పరీక్షలతోపాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీరాంజనేయులు మృతికి ఎమ్మెల్యే నివాళి

కళ్యాణదుర్గం, ఆగస్టు 17: టీడీపీ సాంస్కృతిక విభాగంలో పని చేసిన కూడేరు మండలానికి చెందిన నాప వీరాంజనేయు లు అకాల మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆయన శనివారం అనంతపురం పట్టణంలో వీరాంజనేయులు భౌతిక కాయాన్ని సందర్శిం చి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ వీరాంజనేయులు మృతి దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుడి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని అభయమిచ్చారు.

అపార నష్టం

పుట్లూరు, ఆగస్టు17: జాజికొండ వాగు నుంచి పెద్ద ఎత్తున వర్షపునీరు పుట్లూరు చెరువులోకి చేరుతోంది. కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులు జలకళను సంతరించుకున్నాయి. శనగలగూడూరు, గాండ్లపాడు శివారులో పెద్దవంకలు పారుతున్నాయి. 35 మంది రైతులు 56 హెక్టార్లలో సాగు చేసిన మొక్కజొన్న, ఆముదం, సోయాబీన్, పత్తి తదితర పంటలు దెబ్బతిన్నాయి.

● యల్లనూరు మండలం తిరుమలాపురం, మడుగువంక, నిట్టూరు వద్ద ఉన్న బాల్‌రెడ్డి కట్టవంక ఉధృతంగా ప్రవహించాయి. బాల్‌రెడ్డి కట్టవంక చెరువును తలపించింది. రోడ్డుపై వంద మీటర్ల మేర ప్రవహించింది. యల్లనూరు- తాడిపత్రి వైపు రాకపోకలు నిలిచిపోయాయి. మడుగు వంక ఉధృతంగా ప్రవహించడంతో చిత్రావతినదిలోకి నీరు చేరింది. తిమ్మంపల్లి వద్ద వర్షపు నీరు కాలనీలోకి వెళ్లడంతో తహసీల్దార్ నాగరాజు గ్రామానికి చేరుకొని పరిస్థితి సమీక్షించారు.

రాత్రంతా జాగారం

తాడిపత్రి: పట్టణంలోని శివానగర్, టైలర్స్ కాలనీ, రూరల్‌లోని ఆర్డీటీ కాలనీలో ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. కోమలి, ఆర్డీటీ కాలనీ వద్ద ఉన్న వంకలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. టీటీడీ కల్యాణ మండపం చెరువును తలపిస్తోంది. ఆర్డీటీ కాలనీలో ప్రజలకు టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్‌నాయుడు నిత్యావసర సరుకులను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, ఆగస్టు 17: మండలంలోని ఊబిచెర్ల గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాలజిల్లా ఆత్మకూరుకు చెందిన వరలక్ష్మి, రాఘవేంద్ర, అశ్విని కారులో బెంగళూరుకు వెళ్తుండగా.. ఊబిచెర్ల గ్రామశివారులో .. వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో ఆ ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కాలువపల్లి సమీపంలో ఒకరికి..

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. నార్పల మండలం బొందలవాడకు చెందిన హరికృష్ణ చౌదరి శుక్రవారం రాత్రి స్నేహితులతో కలిసి అనంతపురం నుంచి కళ్యాణదుర్గంకు కారులో బయలుదేరారు. కాగా కాలువపల్లి వద్ద రోడ్డుపక్కన ఆగి ఓ దుకాణంలో నీళ్ల బాటిల్ తీసుకునేందుకు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. దీంతో అతడికి తీవ్ర గాయాలవడంతో స్నేహితులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఏడుగురిపై కేసు నమోదు

పామిడి, ఆగస్టు 17: మండలంలోని రామగిరి గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ వర్గీయులపై వైసీపీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వీరిలో వడ్డె ఎర్రిస్వామి, వడ్డెరుద్రమ్మ, ఏకుల నరేష్, ఏకుల ఎర్రిస్వామి, ఏకుల రాము, ఏకుల బాబుతో పాటు ఓ మైనర్ బాలుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రెండు దుకాణాల్లో చోరీ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 17: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల బ్యాంగిల్ స్టోర్, టీస్టాల్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. న్యూబాలాజీ బ్యాంగిల్ స్టోర్స్ దుకాణం వెనుక నుంచి రేకులను తొలగించి దుండగులు షాపు లోపలకి చొరబడ్డారు. అందులో ఉన్న రూ.10వేలు విలువ చేసే గాజులను, రూ. 6వేల నగదును ఎత్తుకెళ్లారని షాపు యజమాని గాజుల రఘుకుమార్ తెలిపారు. అలాగే పక్కనే ఉన్న అయాన్ టీ స్టాల్‌లో సీసీ కెమెరాలకు ఉన్న హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లారని యజమాని వీరేష్ తెలిపారు. ఈ విషయంపై వారు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు షాపులను పరిశీలించారు.

బోయరెడ్డిపల్లి ఘటనలో 14మంది అరెస్ట్

యాడికి, ఆగస్టు 17: మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో ఈనెల 15న జరిగిన దాడుల సంఘటనకు సంబంధించి శనివారం 14మందిని అరెస్ట్‌చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బోయరెడ్డిపల్లిలో ఈనెల 15న పంటపొలంలో బొగ్గులారీని పంపి పంట నాశనం చేశారని టీడీపీ, వైసీపీ వర్గీయులు రాళ్లు, కట్టెలతో దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఇరువర్గీయుల ఫిర్యాదు మేరకు 32మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో ఒక వర్గానికి చెందిన 14మందిని శనివారం అరెస్ట్ చేశామన్నారు. అరెస్ట్ అయిన వారిలో పడమల ప్రసాద్, పడమల గురుమోహన్, పుట్లూరు ఓబులేసు, పడమల ఓబులేసు, పడమల లక్ష్మీనారాయణ, కొట్టం హరికృష్ణ, కొట్టం పవన్‌కుమార్, కొట్టం మారుతికుమార్, కొట్టం రామచంద్ర, కొట్టం నారాయణస్వామి, చింతకాయల పెద్దయ్య, చింతకాయల రామచంద్ర, పడమల బాల గుర్రప్ప, పడమల బాలన్న ఉన్నట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ రైల్వే ఉద్యోగి మృతి

గుత్తిరూరల్, ఆగస్టు 17: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రైల్వే ఉద్యోగి నీలకంఠేశ్వర(37) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన రైల్వే ఉద్యోగి నీలకంఠేశ్వర గత గురువారం బైక్‌పై వన్నేదొడ్డికి వెళ్తుండగా.. ఆ గ్రామ సమీపంలోకి రాగానే వెనుక నుంచి ఐషర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడగా.. స్థానికులు గుత్తి ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గ్రంథాలయం తనిఖీ

కుందుర్పి, ఆగస్టు 17: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని శనివారం సాయంత్రం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. స్థానిక గ్రంథాలయ అధికారి భాస్కర్ ఉన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన నారసింహుడు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 17: మండలంలోని మల్లాపురం గ్రామంలో విప్రమలై లక్ష్మీనరసింహస్వామి కి గరుడవాహన సేవను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అర్చకులు ఆలయంలో లక్ష్మీసమేత స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని గరుడవాహంపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తిస్వామీజీ , ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఉత్సవ విగ్రహన్ని కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు.

వైభవంగా గ్రామోత్సవం

ఉరవకొండ: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శనివారం గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కన్యకపరమేశ్వరి ఆలయం నుంచి శ్రీవారి ఎదుర్కోలు కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని మేళతాళాల మధ్య పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఆదివారం వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


పెన్నహోబిళంలో లక్ష్మీనరసింహస్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా పల్లకీ సేవ

మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటి స్వామికి బంగారు కన్ను సమర్పణ


భక్తులు అందజేసిన బంగారు కన్ను

గుంతకల్లుటౌన్,ఆగస్టు17: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం బుక్కరాయసముద్రం మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి, అంజలి దంపతులు 20 గ్రాముల బంగారు కన్నును సమర్పించారు. రూ. 1.70లక్షలు విలువ చేసే బంగారపు కన్నును వారు ఆలయ ఈఓకు అందజేశారు. అలాగే తాడిపత్రికి చెందిన సురేష్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు నిత్యాన్నప్రసాద శాలకు రూ. 3.45లక్షలు విలువ చేసే నాలుగు డబుల్ గ్యాస్ స్టౌలు, స్టీల్ బేసిన్లు, సిల్వర్ గిన్నెలు, ఇతర వంట సామగ్రిని ఆలయ అధికారులకు అందజేశారు. అర్చకులు ఇరువురు కుటుంబ సభ్యులకు స్వామి దర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

వెండి ఆభరణాల సమర్పణ

యల్లనూరు: మండలకేంద్రంలోని ఆంజనేయస్వామికి 4కేజీల వెండి ఆభరణాలను భక్తులు విరాళంగా అందించారని అర్చకుడు చందస్వామి తెలిపారు. విడపనకల్లుకు చెందిన పెనికలపాటి రామాంజనేయులు, లలితమ్మ దంపతులు స్వామివారికి వెండితో చేసిన తోకను అందించినట్లు చెప్పారు. అనంతరం వారు స్వామివారికి పూజలు చేశారు.

బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

గుత్తిరూరల్, ఆగస్టు 17: శ్రావణ మాసం సందర్భంగా తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు పంచామృతాభిషేకం చేసి వివిధ పుష్పాలు, తమలపాకులతో అలంకరించి పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ నాగేంద్రుడు, అర్చకులు రవిస్వామి, చేతన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్, రబీ పంటల బీమాను ప్రకటించాలి

ఉరవకొండ, ఆగస్టు 17: 2023వ సంవత్సరంలోని ఖరీఫ్, రబీ సీజన్లలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, సాగుచేసిన పంటలన్నీ దెబ్బతిని రైతులు నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే పంటల బీమాను ప్రకటించాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం వారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను శనివారం కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మధుసూదన్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 17: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్, ప్యానల్ న్యాయవాది బీఎస్ కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ప్రగతి మైత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి మైత్రి మహిళా సభ్యులకు గృహహింస, పోక్సో, మానవ, అక్రమ, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ప్యానల్ న్యాయవాదులు సీ వెంకటేశ్వర్లు, ఎం నాగేశు, ఆర్ బడేసాబ్, మోహన్, తిమ్మారెడ్డి, కోర్టు సూపరింటెండెంట్ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంజప్పతాత రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 17: మండలంలోని మోపిడి గ్రామంలో శనివారం సంజప్పతాత రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు, హోమాలు చేపట్టారు. తర్వాత మడుగు తేరును నిర్వహించారు. సాయంత్రం రథాన్ని ఆలయం నుంచి బసవన్న కట్ట వరకూ లాగారు. రథంపైకి భక్తులు అరటిపండ్లు, జామపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అవాంఛనీయసంఘటనలు జరకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

'బాలికలను రక్షిద్దాం'

కుందుర్పి, ఆగస్టు 17 : మండలం తెనగల్లులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆర్డీటీ, మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం అనే కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సీడీపీవో వనజ అక్కమ్మ హాజరై మాట్లాడారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయన్నారు. బాలికలు శారీరక, మానసిక రోగాలకు గురవుతాయని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేసే వారికి కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, హెచ్ఎం వెంగప్ప, ఏఎన్ఎం రేఖ, ఆర్డీటీ టీమ్‌లీడర్ ఆదినారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఈఈగా మురళీధర్

అనంతపురం సిటీ, ఆగస్టు17 : ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని గుత్తి పీఆర్ఐ డీఈఈగా పనిచేస్తున్న మురళీధర్‌కు అదే శాఖ పరిధిలోని ఉరవకొండ పీఆర్ఐ ఇన్‌చార్జి డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆశాఖ ఎస్ఈ కేవీ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఉరవకొండ ఇన్‌చార్జి డీఈఈగా పనిచేస్తున్న అరుణ్‌కుమార్ అనంతపురం పీఆర్ఐ డివిజన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో నేడో రేపో ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు తీసుకోనున్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

పుట్లూరు, ఆగస్టు 17: మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో జయలక్ష్మమ్మ (40) అనే మహిళా అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులురెడ్డి, జయలక్ష్మమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. కాగా భర్త శ్రీనివాసులురెడ్డి గత శుక్రవారం రాత్రి శింగనమలకు వెళ్లాడు. తెల్లవారే సరికి జయలక్ష్మమ్మ ఇంటి ఎదురుగా ఉన్న కొట్టంలో విగతజీవిగా పడి ఉంది. పక్కింటి మహిళ ఆమెను లేపడానికి ఇంటి తలుపుతట్టగా అక్కడ కనిపించలేదు. ఎదురుగా ఉన్న కొట్టంలో చూడగా విగతజీవిగా కనిపించింది. వెంటనే స్థానికులు భర్తకు, పోలీసులకు సమాచారం అందించారు. నుదుట గాయం ఉండడంతో అనుమానం ఉందని భర్త పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ సుబ్రమణ్యం డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు.

కేపీఎల్ ఫైనల్‌కు మంత్రుల రాక

కళ్యాణదుర్గం, ఆగస్టు 17: పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో కేపీఎల్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలు అందించేందుకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లాలోని మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు హాజరయ్యే అవకాశం వుంది. ఈ నేపథ్యంలో రూట్‌మ్యాప్‌ను శనివారం పరిశీలించారు. టీడీపీ నాయకులు ధర్మతేజ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, కేపీఎల్ నిర్వాహకులు కలిసి రూట్‌మ్యాప్ ను పరిశీలించారు. ఫైనల్‌మ్యాచ్‌కు అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 17: రాబోయే మూడురోజుల పాటు అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎమ్మార్వో రఘు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవరైనా పాత మిద్దెల్లో ఉంటే వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఏదైనా విపత్తు ఎదురైతే తహశీల్దారు కార్యాలయానికి, లేదా గ్రామ పరిధిలో ఉన్న గ్రామ రెవెన్యూఅధికారికి సమాచారం అందించాలని తెలిపారు.

అక్రమ లేఔట్ల తొలగింపు

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 17 : మండలంలోని లక్ష్మంపల్లిలో ప్రభుత్వ భూమి సమీపంలో కొందరు అక్రమంగా వేసిన లేఔట్లను శనివారం తొలగించినట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి విలేకరులకు తెలిపారు. కొంతమంది ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతో అటువంటి వాటిని సర్వే చేసి అక్రమ లేఔట్లను వీఆర్వోలతో తొలగించినట్లు తహసీల్దార్ చెప్పారు.

చెరువుల్లో టీడీపీ నాయకుల పూజలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 17 : కంబదూరు మండలంలోని మరిమాకులపల్లిలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామంలో ఉన్న రెండు చెరువులు నిండాయి. దీంతో ఆ చెరువుల వద్ద శనివారం టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు పట్టారు.

బొమ్మనహాళ్ ఎస్ఐ బదిలీ

బొమ్మనహళ్, ఆగస్టు 17: బొమ్మనహాళ్ ఎస్ఐ శ్రీనివాసులు బదిలీ అయినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కర్నూలు జిల్లా హోళగుంద నుంచి ఇక్కడికి ఆయన బదిలీపై వచ్చారు. తిరిగి శనివారం కర్నూలు జిల్లాలోని నందవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయినట్లు తెలిసింది. ఈయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.